

రాయితీలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో సూక్ష్మ సేద్య పథకం రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్లో సూక్ష్మ సేద్య పథక విధివిధానాలు, రాయితీల వివరాలను తెలియజేసే పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల శాఖ పథకం క్రింద మంజూరైన పథకాలు అన్నింటిని రైతులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బిందు నీటి సాగు, తుంపర్ల నీటి సాగు పథకాల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ నాయక్, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సత్యనారాయణ, శివన్నారాయణ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రెవెన్యూలో మహా మాయగాళ్లు..!

- గ్రామ విస్తరణ 4,020 ఎకరాలు
- వెబ్ ల్యాండ్‌లో 8,326 ఎకరాలు
- భూ సేకరణ పేరుతో భారీ మోసం

రెవెన్యూలో మహా మాయగాళ్లు ఉన్నారు. ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా వైసిపి, టిడిపి ప్రభుత్వంలో కొందరు రెవెన్యూ అధికారులు గ్రామ రికార్డులను మార్చి భారీగా ప్రభుత్వ నిధులు దోచిడీ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. నడికేరెల్- ఏర్పేడు జాతీయ రహదారి నిర్మాణం, సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భూ సేకరణలో భారంగా భారీగా భూమి తీసుకున్నారు. ఇందులో అడంగల్ రికార్డుల్లో భూములు చూపి ఎంచి కోట్ల రూపాయలు కాజేసినట్లు తెలుస్తోంది. మర్రిపాడు మండలంలోని అనేక గ్రామాల్లో ఇలా జరిగినట్లు సమాచారం. ఓ అధికారపార్టీ నేత ప్రభుత్వ భూమిని 100 ఎకరాలు తమ పేరుపై రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది. నిరుపేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూమికి రాజకీయ పార్టీల నేతలు రెవెన్యూ అధికారుల ప్రోత్సాహంతో ఆక్రమించినట్లు సమాచారం..

ప్రభుత్వ భూమిలో జామాయిల్ సాగుచేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లాలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలోని రాజకీయ నేతలు ప్రోత్సాహంతో రెచ్చిపోతున్నారు. డబ్బు, బదిలీల పేరుతో కొందరు రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు, రాపూరు, మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణాలు, సోమశిల హైలెవల్ కెనాల్ కోసం భూ సేకరణ చేశారు. ఇందులో కొందరు అధికారులు భూ రికార్డులను తారుమారు చేసి, భారీ స్థాయిలో ప్రభుత్వ నిధులు కాజేశారు. మర్రిపాడు మండలం, చుంచులూరు గ్రామంలోని అనేక అక్రమాలు జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామంలోని భూ విస్తరణ కేవలం 4,020 ఎకరాలు మాత్రమే. రెవెన్యూ అధికారుల లీలతో భారీగా భూ వెబ్ - ల్యాండ్ అడంగల్ ప్రకారం 8,326 ఎకరాలుగా మార్పు చేసినట్లు సమాచారం. ఈ మొత్తంలో కొంత తమ భూమిగా రికార్డులు సృష్టించి, జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ భూమి ఇచ్చినట్లు అందుకు సంబంధించిన నగదు భారీ మొత్తంలో కాజేసినట్లు తెలిసింది. ఇక్కడ కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి దర్జాగా ఆక్రమిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతానికి చెందిన ఓ అధికారపార్టీ నేత తమ కుటుంబ సభ్యుల కేవలం నెలలూరు మాత్రమే ఉండగా సుమారు 100 ఎకరాలు ప్రభుత్వ భూమిని తమ భూమిగా రికార్డులు సృష్టించారని తెలుస్తోంది. చుంచులూరు గ్రామంలోని సర్వే నెంబర్ 169-1, 171, 13-1, 17-1, 492-2, 435, 494-2, 501, 505 పి, 506, 583, 447-1, 448-1 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి కాగ, దీనిని ఆక్రమించి తమ సొంత భూమిగా రికార్డులు మార్పు చేసినట్లు తెలిసింది. ఓవైపు భూమి తీసుకోవడంతోపాటు, ప్రభుత్వం భూ నిర్వాసితులకు ఇచ్చిన నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పనిచేసిన తహశీల్దారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది నిర్వాహకం కారణంగా ఇలా జరిగింది సమాచారం. ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు బయటకొచ్చే అవకాశం ఉంది.

పేదలకు సెంటు భూమి ఇవ్వరు

రెవెన్యూ అధికారులు నిరుపేదలు, దళితులు సాగుచేసుకోవడానికి సెంటు భూమి ఇవ్వమంటే వంద రకాల ఆంక్షలు పెట్టే అధికారులు రాజకీయ నేతలు, బడా బాబులకు అప్పనంగా వందల ఎకరాలు కట్టబెడుతున్నారనే విమర్శలున్నాయి. మర్రిపాడు మండలం, చుంచులూరు గ్రామంలో తోపాటు, దుత్తలూరు గ్రామాల్లో ఓ వ్యక్తి వంద ఎకరాలు ఆక్రమిస్తే రెవెన్యూ అధికారులు నోరుమెదపడం లేదనే విమర్శలున్నాయి. ఈ ప్రాంతాల్లోని పేదలు ఎకరా, రెండు ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటే మాత్రం పోలీసులు, అరెస్ట్, కోర్టుల ఇలా హడావుడి చేసే అధికారులు ఇలాంటి వ్యక్తుల పట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తు న్నారో వారికే తెలియాలి, కలెక్టర్ విచారణ జరిపి నిరుపేదలకు సాగు భూమి ఇవ్వాలని ఈ ప్రాంత పేదలు కోరుతున్నారు.

ఉప ఖజానా కార్యాలయంపై ఏసీబీ దాడులు...

ప్రజాశక్తి-ఉదయగిరి: నెల్లూరు జిల్లా ఉదయగిరి ఉప ఖజానా కార్యాలయం ఎస్‌టిఓ మమతను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు జిల్లా ఏసిబి డిఎస్‌పి శిరీష పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ కంప్లైంట్ దారుడు పక్కా సమాచారంతో ఎస్‌టిఓ మమత ఓ ప్రయివేట్ వ్యక్తికి 40వేల నగదును తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎస్‌టిఓ మమతను పట్టుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కంప్లైంట్ దారుడు వరికుంటపాడు మండలం, తూర్పుబోయమడగల పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంగయ్య సంబంధించి ఎనిమిది లక్షల 96 వేలకు సంబంధించిన బిల్లులు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో ఈ ఉపాధ్యాయుడు లంచం ఇచ్చేందుకు సహించక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎస్‌టిఓ ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. కార్యక్రమంలో ఏసీబీ సిఐలు ఆంజనేయ రెడ్డి, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకి సలహాలిస్తున్న ఎఓ రాము

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని పలుకూరు, మహదేవపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఎఓ వి రాము మాట్లాడుతూ శనగ వేసే రైతులు తప్పనిసరిగా ట్రీకోడర్మా విరిడి పౌడరు 10గ్రాములు కేజి విత్తనంతో కలిపి విత్తన శుద్ధి చేసి వితుకోవాలని సూచించారు. కార్యక్రమ ంలో వ్యవసాయ మార్కెట్ అధికారి షేక్ ఖాసీం, పలుకూరు గ్రామ ఉద్యాన సహాయకులు ఐ.బ్రహ్మాని, మహాదేవపురం గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్. నజీర్ బాషా, పలుకూరు ఎంపిటిసి స్వర్ణ పున్నయ్య, రైతులు పాల్గొన్నారు.

భారీ సంఖ్యలో మొబైల్ ఫోన్స్ రికవరీ

-700 మంది బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

సెల్ ఫోన్లు ఉన్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు: మొబైల్ హంట్ అప్లికేషన్ సహకారంతో కోటి యాభై లక్షల విలువ చేసే 700 సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్‌పి జి.కృష్ణకాంత్ అందజేశారు. మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మీడియా సమక్షంలో బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరి జీవితంలో సెల్‌ఫోన్ ఒక ప్రధాన భాగమైందన్నారు. సెల్‌ఫోన్‌లో కీలకమైన సమాచారాన్ని భద్రపరుచుకోవడమే కాకుండా నగదు బదిలీ, సర్టిఫికెట్లు, వాహన రిజిస్ట్రేషన్ సంబంధించిన కాగితాలు ఇలా ప్రధానమైన భద్రపరుచుకుంటున్నారన్నారు. అటువంటి సెల్‌ఫోన్ చోరీ కావడం తీవ్రమైన మానసిక వేదనకు గురిచేస్తుందన్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసు శాఖ రూపొందించిన మొబైల్ హంట్ సేవలు, కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మొబైల్ హంట్ సేవల ద్వారా 7 విడతల్లో సుమారు రూ. 8 కోట్ల విలువ చేసే 3 వేల సెల్‌ఫోన్లు బాధితులకు పోలీసు శాఖ అందజేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ. 8 లక్షల విలువ చేసే 40 మొబైల్ బాధితులకు అందజేసిన ఘనత పోలీసు శాఖకు దక్కుతుందన్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయకుండా కేవలం 9154305600 నెంబర్‌కు వాట్సాప్ సందేశం ద్వారా మొబైల్ హంట్ సేవల ద్వారా పూర్తి సమాచారాన్ని నమోదు చేసే ఒక్క సందేశంతో పోన్లు రికవరీ చేసుకోవచ్చున్నారు. సరైన బిల్లులు లేకుండా నూతన, సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని ప్రజలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన జర్నలిస్టు మిత్రులందరికీ ముందుగా అంతర్జాతీయ జర్నలిస్టు దినోత్సవ అభినందనలు తెలియజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-నెల్లూరు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ స్థానిక స్టోన్ హౌస్ పేట ప్రాంతంలోని జిల్లా గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలను గ్రంథాలయాల ద్వారా అధ్యయనం చేసి విజ్ఞానాన్ని మహానుభావులు సంపాదించుకొని భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తర్వాత తరాలకు అందించారని తెలిపారు. గ్రంథాల యాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని విశిష్టమైన పుస్తకాలను గ్రంథాలయాల వేదిక ద్వారా అవగాహన కల్పించుకోవాలని సూచిం చారు. ప్రజలందరిలో మేధో సంపత్తి ఎదగాలంటే గ్రంథాలను విశిష్టమైన పుస్తకాల ద్వారా మాత్రమే సాధించగలరని విశ్లేషించారు. ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ ఆధారితంగా అన్ని విషయాలు మొబైల్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నప్పటికీ పుస్తకాల పఠనం ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించి తమ తమ రంగాల్లో రాణించేందుకు గ్రంథాలయాలను విరివిగా వాడుకోవాలని ఆకాంక్షించారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి-నెల్లూరు : భారతరత్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి కోవూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏటూరు శ్రీనివాసుల రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి పిలుపు మేరకు ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో పేదరిక నిర్మూల నకు 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయకరణ రాజభరణాల రద్దు,దేశానికి అణు సాంకేతిక విప్లవానికి పునాదివేసిన ఇందిరా గాంధీ భారత ప్రజలకు చిరస్మరణీయురాలని కొనియాడారు. కార్యక్రమ ంలో తలారి బాల సుధాకర్, మీడియా ఇన్‌ఛార్జ్ అడ్వొకేట్ కే.సంజయ్ కుమార్, షేక్ అల్లావుద్దీన్ హుస్సేన్ బాషా, హుస్సేన్ బాషా రూరల్ మల్లికార్జున రెడ్డి, మల్లి కిషోర్ రెడ్డి, సీతా సుబ్బారావు, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కోవూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలైన పాటూరు, గుమ్మళ్లదిబ్బ ప్రాంతాల్లో చేనేతలు అధికంగా ఉన్నారని, నియోజకవర్గంలో వ్యవసాయం తర్వాత అధిక ఉపాధి కల్పించే చేనేత రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకుంటుందో వివరించాలని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆమె శాసన సభలో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. గౌరవ హ్యూమన్ రిసోర్సస్ అండ్ ఐటి మినిష్టర్ లోకేష్ బాబు ప్రాతినిత్యం వహించే మంగళగిరిలో "వీవర్స్ శాల" లాంటి నాలెడ్జ్ అండ్ మార్కెటింగ్ సపోర్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రతిపాదన ఉందా, ఉంటే అలాంటి వెసులుబాటు కోవూరు నియోజకవర్గానికి కల్పించాలని విన్నవించారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని, చేనేత కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేదానిపై ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదని, అనర్హులకు పథకాలు అమలు చేసి అర్హులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేతలకు మేలు జరిగేలా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఆప్కో షోరూం లను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. బిర్లా కంపెనీతో కూడా చర్చించామని, నాలుగు, ఐదు జిల్లాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు వారు ముందుకు వచ్చారన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడుకుందాం

కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోవూరు నియోజకవర్గ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గంలో నీటి పారుదలలో తలెత్తుతున్న ఇబ్బందులను, కనిగిరి రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితిని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ఈ అంశాలను ప్రస్తావించారు.దేశానికి అన్నం పెట్టిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ సొంతమన్నారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో పంటలు లాభసాటిగా పండటం కోసం రైతు సంక్షేమం కోసం ఇరిగేషన్ ప్రాజెక్టులు పెద్దస్థాయిలో నిర్మాణం చేసిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఆధునిక నీటి విధానాలు తీసుకువచ్చి ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో కొత్త సాంకేతిక విధానాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలవరం, పట్టిసీమ లాంటి ప్రాజెక్టులు పూర్తిగా రైతులకు అందుబాటులో వస్తే రాష్ట్రంలో రైతులు బంగారం పండిస్తారన్నారు. ప్రత్యేకంగా నెల్లూరు జిల్లాలోని కోవూరు నియోజకవర్గం పూర్తిగా డెల్టా ప్రాంతమని, వ్యవసాయంపై ఆధారపడి ప్రజలు జీవిస్తుంటారన్నారు.

ఘనంగా ఆయాలకు సత్కారం

ప్రజాశక్తి-నెల్లూరు: కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో వరల్డ్ టాయిలెట్ సందర్భంగా పాఠశాలను శుభ్రంచేసే ఆయాలు రమణమ్మ, విజయ లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు శాలువా కప్పి పూలమొక్కలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. పాఠశాలను , మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుతూ, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయాలను సన్మానించడం మన కర్తవ్యం అని అన్నారు. పిల్లలు చిన్న తనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రత పై అవగాహన కలిగుండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

రాళ్లపాడు ఎడమ కాలువ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-లింగసముద్రం/కందుకూరు

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో కందుకూరు ప్రజల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యలపై కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారి అసెంబ్లీలో మంగళవారం మాట్లాడారు.కందుకూరు నియోజకవర్గం ప్రజల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నుంచి గొట్టిపాటి కొండపనాయుడు ఉత్తర కాలువ ద్వారా 1.5 టిఎంసిలు నీరు రాళ్లపాడు ప్రాజెక్టుకు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ కాలువ లో నీటిపారుదల సరిగా లేక 0.5 టిఎంసి నీరు కూడా ప్రాజెక్ట్‌కు చేరడం లేదన్నారు.పూర్తిస్థాయిలో నీరు రాక కందుకూరు నియోజకవర్గం రైతాంగం పంటలు పండించేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు.రాళ్లపాడు ప్రాజెక్టు సంబంధించిన 2018వ సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మా స్వగ్రామమైన బడేవారి పాలెం పర్యటనలో రాళ్లపాడు ఎడమ కాలువ పనులకు సంబంధించిన జీఓ నెం. 116 ద్వారా ఎడమకాలువ పొడగింపు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు.ఈ ఎడమ కాలువ పనులు పూర్తయితే వలేటివారిపాలెం మండలం, లింగసముద్రం మండలాల్లో వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులపై ఎటువంటి పురోగతి లేదని ధ్వజమెత్తారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు రాళ్లపాడు ప్రాజెక్టును డిప్ ఇరిగేషన్ పథకంలో ప్రాజెక్ట్ అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు.ప్రాజెక్ట్ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రిని కోరారు.ముందుగా తనకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్, కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ప్రమోషన్లు కల్పించండి

మండలిలో ఎంఎల్‌సి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ పాఠశాలలల్లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లు బలోపేతం కావాలంటే, పేద పిల్లలకు నాణ్యమైన ఇంటర్ మీడియట్ విద్య అందాలంటే... తప్పనిసరిగా పిజిటి హోదాతో పని చేసే పూర్తి స్థాయి అధ్యాపకులు అవసరం ఉంది. ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలిలో ఈ అంశంపై మాట్లాడారు. సంబంధిత మానేజ్మెంట్ స్కూల్స్ లోని స్కూల్ అసిస్టెంట్స్ కు ప్రమోషన్లు కల్పించి పూర్తి స్థాయి పిజిటి లను ఏర్పాటు చేయాలని కోరారు ప్రభుత్వ ఉద్యోగులకు టీడీపీ తమ మ్యానిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 23శాతం కంటే తక్కువ లేకుండా ఐఆర్ ని ప్రకటించాలని కోరారు.

ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి

ఘనంగా కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-లింగసముద్రం

కెనరా బ్యాంక్ 119వ వార్షికోత్సవాన్ని మండల కేంద్రమైన లింగసముద్రంలోని కెనరా బ్యాంకులో ఘనంగా నిర్వహించారు.బ్యాంక్ మేనేజర్ సిహెచ్.శేషగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ వ్యవస్థాపకులు అమ్మెంబాల్ సుబ్బారావుపై చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ శేషగిరి మాట్లాడుతూ 1906వ సంవత్సరంలో బ్యాంకును స్థాపించినప్పటి నుంచి అంచెలంచలుగా ఎదుగుతూ దేశంలోనే ప్రధాన బ్యాంకుల్లో కెనరా బ్యాంక్ ఒకటిగా నిలిచిందన్నారు.ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు వారికి అవసరమైన అన్ని సేవలను త్వరితగతిన పూర్తి చేసి ఖాతాదారుల విశ్వాసాన్ని పొందుతామన్నారు.కార్యక్రమంలో ఎఇఒ శశాంక్, ఆఫీసర్లు శ్రీకాంత్, ఎన్. పార్వతి, క్యాషియర్ కె.మహేంద్ర, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న అధికారులు

బాలుడిపై పంది దాడి

ప్రజాశక్తి-గుడ్లూరు: స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన ఏడు సంవత్సరాల బాలుడుని పంది తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన బెల్లంకొండ శ్రీనాథ్ బహిర్భూమి కోసం సమీపంలోని శ్మశానం దగ్గరికు వెళ్లాడు.అక్కడ ఉన్న ఓ పంది పడి కలిసి తీవ్రంగా పరచడంతో బాలుడు పెద్దగా కేకలు వేశాడు. సమీపంలోని కొందరు కర్రలు తీసుకొని కొట్టారు. గాయపడిన బాలుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం కందుకూరి ఏరియా వైశాలకు తరలించారు. ప్రథమ చికిత్సానంతరం వైద్యాధికారుల సలహా మేరకు ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. బాలుడు బంధువులు పందుల నిర్వాహకులపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

మాట్లాడుతున్న ఆర్జేడి బి లింగేశ్వర రెడ్డి

త్వరగా అపార్ నమోదు పూర్తి చేయండి

ప్రజాశక్తి-కందుకూరు: ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) బి. లింగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణం లోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో అపార్ ఐడీ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం జరగరాదన్నారు. మండలంలో అపార్ నమోదు తక్కువగా ఉన్న ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. అపార్ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు .విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ ఎంవి జానకిరామ్, ఎంఇఒలు కె సుబ్బారెడ్డి, బి అజయ్ బాబు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కందుకూరులో మంగళవారం మాజీ భారత ప్రధాని మొట్టమొదటి మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు రంగవల్లి, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్యఅతిథి హిందీ పండిట్ సిహెచ్ సుబ్బారావు హాజరయ్యారు.కార్యక్రమంలో గ్రంథపాలకురాలు నాగరజని పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టాయిలెట్ దినోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు: మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవాన్ని కాపాడటమే కాకుండా ఆరోగ్యంరంగా పెనుమార్పులకు కారణమవు తుందని కలెక్టర్ ఒ. ఆనంద్ పేర్కొన్నారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా తాగునీరు, పారిశుధ్య మిషన్ జిల్లా స్థాయి సభ్యుల సమావేశం నిర్వహించారు. తొలుత ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ వెంకట రమణ కార్యక్రమాన్ని ఉద్దేశం గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో మరుగుదొడ్లు ఉండేవిధంగా ప్రజలందరూ ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లను వినియోగించుకోవడం గ్రామీణ ప్రజల గౌరవాన్ని ముఖ్యంగా మహిళల గౌరవాన్ని కాపాడటమే కాకుండా ఆరోగ్యపరంగా వారి జీవితాల్లో పెనుమార్పులకు కారణమవు తుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన కొందరికి కలెక్టర్ మరుగుదొడ్ల మంజూరు పత్రాలను అందజేశారు. సమావేశంలో డిపిఒ శ్రీధర్ రెడ్డి, డిఇఒ బాలాజీ రావు, జెడ్‌పి సిఇఒ మోహన్ రావు, వ్యవసాయ అధికారి సత్యవాణి, ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఒ ఆనంద్

గ్యాస్ సబ్సిడీలను బ్యాంక్‌లో జమచేయొద్దు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

: గ్యాస్ సబ్సిడీలను బ్యాంక్‌లలో జమ చేయొద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం పేదలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయడం హర్షదాయకం అన్నారు. గ్యాస్ సబ్సిడీని బ్యాం క్‌లలో జమ చేయడం వలన పేదలు సబ్సిడీ పొందలేక పోతున్నారని తెలిపారు. అందుకు పేదలు దీర్ఘ కాలంగా బ్యాంక్ లావాదేవీలు జరపకపోవడం, ఖాతాల లో కనీస బ్యాలెన్స్ లేక పోవడం వెరసి సబ్సిడీ పైకాన్ని బ్యాంక్ అధికారులు బిగబడుతున్నారని తెలిపారు. సబ్సిడీ డబ్బులు అందక పోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కూడా వృద్ధాప్య, వికలాంగ పింఛన్ బ్యాంక్‌లలో జమ చేయడం వలన ఆరువేల పింఛన్లకు గాను కేవలం 1500 ఇచ్చారని తెలిపారు. ఒకప్పుడు బ్యాంక్‌లు పేదవారికి లోన్‌లు ఇచ్చి సహకరిం చినప్పటికి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వ చ్చి నప్పటి నుండి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీ డబ్బులను సచి వాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరి వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, మోహన్‌రావు, అంచిపాక వేణు, చెరుకూరి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

జానకంపేటలో దాహం..దాహం..

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్: మండలంలోని జానకంపేట గ్రామంలో సుమారుగా నెలరోజుల నుంచి తాగునీరు లేక సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు తెలియపరిచారు. గ్రామంలోని వర్షపు నీరు నిలిచి మురుగు రోడ్లపై పేరుకుపోవడం వలన దుర్వాసన వస్తుందని గ్రామంలో శానిటైజర్ చేయాలని బావులలో బ్లీచింగ్ వేయాలని గ్రామంలో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయని సంబంధిత అధికారులకు గ్రామ సర్పంచ్ కి సెక్రెటరీ టి రవీంద్ర కి తెలియపరిచారు. పట్టించుకున్న దాఖలాల్లేవని సదరు గ్రామ ప్రజలు కాపులూరి ప్రసాద్, కాపులూరి విజయభాస్కర్, చెంగులూరి వీరయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, కాపులూరి వెంగయ్య, మళ్లీ బోయిన చిన్న అంకయ్య, మల్లికార్జున. గ్రామ ప్రజలు తెలియపరిచారు.

మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : శక్తిమాత శ్రీ చాముండేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంగపట్నం గ్రామంలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయానికి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి వారి సతీమణితో విచ్చేసి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి టిడిపి నాయకులతో కలిసి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ తాత శ్రీనివాసులు, కొండూరు సుధాకర్ రెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, గుండాల కృష్ణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, ముంగర గోపాల్‌యాదవ్, జనసేన నాయకులు మోహన్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

21న ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఆర్‌టిసి రీజినల్ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం తనకు అవకాశం ఇచ్చిందని, 21న ఆర్‌టిసి ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయనున్నానని, చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలను చాలావరకు జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రోడ్లను మరమ్మతులు చేయకుండా విస్మరించడంతో, ఆర్టీసీకి ఎంతో నష్టం వాటిలిందన్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వ్యాపారులు, ప్రజలు, ఆర్టీసీ ఆర్థికంగా నష్టపోయిందన్నారు. ఆర్‌టిసిలోని ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఏనాడూ గత ప్రభుత్వం కృషి చేయలేదన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు పనిచేస్తానన్నారు. జిల్లా మంత్రులైన పొంగూరు నారాయణ ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి, వాళ్ల సలహాలు సూచనలతో ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేలా చూస్తామన్నారు. నెల్లూరు బస్టాండ్ లో నా మిత్రుడైన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయనున్నానని, ఈ కార్యక్రమానికి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణ, మాజీ వైద్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, వేములపాటి అజయ్, పోలంరెడ్డి దినేష్ రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, కందికట్ల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కౌమరదశ బాలికలు సాధికారతకు కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని సఖి అడ్మిన్ షేక్.షెహనాజ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల కిశోర వికాస్ కార్యక్రమాన్ని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ, శిశు సంక్షేమశాఖతో పాటు వైద్యారోగ్యం, విద్యా, సెర్ప్, పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కౌమర బాలికల కోసం పనిచేయాలన్నారు. కౌమర దశ బాలికలకు ఆరోగ్యం, విద్యా, రుతుక్రమంలో పరిశుభ్రత, పౌష్టికాహారం, ఉపాధి కల్పన, బాల్య వివాహాల నిరోధంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సిడిపిఒ సునీలత, సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో మెప్మా టిఎంసి జి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కావలి : స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యార్థులకు ఆటల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జవహర్ భారతి కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి విచ్చేశారు. ఇంకా కరస్పాండెంట్ జేమ్స్ రాబర్ట్, ప్రిన్సిపాల్ సిస్టర్ విమలారూబీ, పి.ఇ.టి. ప్రవీణ్ ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ క్రీడలలో రన్నింగ్, షాట్‌పుట్, కబడ్డీ, త్రో బాల్, జూనియర్ సీనియర్ విభాగాలకు నిర్వహించారు. విజేతలను ఉద్దేశించి పిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో చదువుతోపాటు ఆటలతో విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి ఈ పాఠశాల యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం గర్వకారమన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ప్రజాశక్తి కోవూరు : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కోవూరు ఎక్సైజ్ సిఐ బి.కిషోర్ కోరారు. కోవూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో మంగళవారం మత్తు పదార్థాలను నివారించేందుకు యువత ముఖ్య భూమిక పోషించాలనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి, ఎక్సైజ్ ఎస్ఐ గౌస్ బాషా, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : ఎస్‌పి ఆదేశాల మేరకు ఐజీవల కాలంలో ఆలయాల్లో జరుగుతున్న దొంగతనాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిట్రగుంట ఎస్ఐ బోజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులలో చోరీలను అరికట్టేందుకు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైన దేవాలయాల వద్ద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దేవాలయాల్లో నిర్వాహకులు విలువైన వెండి, బంగారు ఆభరణాలను రాత్రి సమయాల్లో ఇళ్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. దేవాలయాలలో చర్చిలలో మసీదులలో భక్తులు ఇచ్చే కానుకలను ఉంచుకుంటే భద్రపరుచుకోవాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా వెంటనే పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని మా ఫోన్ నెంబర్ 08626246233, 9440796338లకు సమాచారం అందించాలని తెలిపారు. మండలంలో రాత్రి సమయాల్లో పోలీసు పహారా కూడా ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-విడవలూరు : విడవలూరు గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరవ దినం మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఆదివారం రంగవల్లులు, చిత్రలేఖనం డ్రాయింగ్ వ్యాసరచన క్విజ్, మ్యూజికల్ చైర్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆర్ట్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పోలీస్ శాఖ సంబంధించిన రమ్య విచ్చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు : మర్రిపాడు ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు జ్యోతి, ధనలక్ష్మి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు.

విద్యతోనే మహిళాభివృద్ధి

ప్రజాశక్తి-అనంతసాగరం : మహిళలు అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధించాలంటే ప్రతి మహిళ చదువుకోవడం ద్వారానే సాధ్యమవుతుందని టిబిఎన్ఎం జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని బిట్రెడ్డి లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని మహిళా లోకానికి ఎన్నో తెలిపిన ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : సీజనల్ వ్యాధుల నివారణ పట్ల మండలంలోని సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డయేరియా, మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ సిహెచ్. విజయదుర్గ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రమేష్ నాయుడు, సచివాలయ సిబ్బంది కె.సుజన, పాఠశాల ఉపాధ్యాయులు కె. హెప్సీ, విద్యులత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-బిట్రగుంట : నెల్లూరు నారాయణ హాస్పిటల్స్ వారి సహకారంతో బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ప్రారంభించారు. ఇందుకూరు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. నారాయణ హాస్పటల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె, మంగమూరు, ఏనుగుల బావి, చెన్నూరుపాలెం గ్రామంలో జరుగుతున్న సర్వే త్వరితగతిని పూర్తి చేయాలని బోగోలు మండల ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో జువ్వలదిన్నె పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు, మంగమూరు, ఏనుగులబావి, చెన్నూరుపాలెం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఆత్మకూరు కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఆదిఆంధ్ర పాఠశాలలో కెనరా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ చెన్నుపల్లి రాంబాబు పాఠశాలకు రూ.1.50 లక్షలు విలువైన పాఠశాల అభివృద్ధికి సామగ్రిని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్రా నాగేంద్ర, నాగేంద్ర సమక్షంలో ఎల్‌వి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కెనరా బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు కెనరా బ్యాంక్ వ్యవస్థాపకుడు సుబ్బారావు పాయ్ చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ

మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ ఆంజనేయులు

విద్యార్థి కెనరా బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ చెన్నుపల్లి వెంకట రాంబాబు పాఠశాలకు 1.50లక్షల విలువైన సామగ్రి పాఠశాలకు ఇవ్వడంపై ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు కుర్చీలు, పాఠశాల ఉపాధ్యాయులకు కుర్చీలు, వాటర్ ఫిల్టర్, విద్యార్థులకు ఆట వస్తువులు, స్టాండ్ ఫ్యాన్లు, ప్రాజెక్టు, దానికి డిస్‌ప్లేయర్, కార్పొరేట్ సోషల్ రెస్పాండెంట్ స్కీమ్ కింద పాఠశాల అభివృద్ధికి యువతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంకు వచ్చే ఆదాయంలో వెనుకబడిన వారి అభివృద్ధి కోసం శిక్షణలు ఇవ్వడం, పాఠశాలల అభివృద్ధికి ఏడు కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. విద్యా జ్యోతి స్కీమ్ కింద వెనుకబడిన బాలికలకు 6, 7 తర్వాత విద్యార్థులకు, రూ.2700 స్కాలర్‌షిప్ ఇచ్చారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు రూ.5వేలు స్కాలర్‌షిప్ ఇచ్చారు. ఈ స్కిన్ కింద రూ.8 కోట్లు ఖర్చుపెట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్ శాలువాలతో సన్మానించారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థులు సిపిఎం నాయకులు, గంటా లక్ష్మీపతి, ఎం.నాగేంద్ర సమావేశం గురించి మాట్లాడారు. ఉపాధ్యాయురాలు సిహెచ్ మాలకొండమ్మ, పాఠశాల చైర్మన్ గంగమ్మ, వైస్ చైర్మన్ వన్నెం తిరుపతమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ సరెండర్

ప్రజాశక్తి-కొడవలూరు

కొడవలూరులోని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ విష్ణు ప్రతాప్ శుక్లాను సరెండర్ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా శ్రీ కాళహస్తి ఏకలవ్య పాఠశాల లెక్చరర్ విష్ణు ప్రియను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. నీటి కలుషితం వల్ల 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో ప్రిన్సిపల్‌ను సరెండర్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్‌టి నాయకులు పాఠశాలలో పరిశీలించి విద్యార్థులతో స్థానిక సమస్యలపై చర్చించారు.

అనర్హులకు పెన్షన్..

- ఎంపిడిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని పాపన్నగారిపల్లికి చెందిన తెలనాకుల సత్యనారాయణ, వికలాంగుడు కాకుండానే వికలాంగుల పెన్షన్ తీసుకోవడంపై అదే గ్రామానికి చెందిన గంగవరపు శ్రీనివాసులు ఎంపిడిఒ వేణుగోపాలరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అతను వికలాంగుడు కాకుండానే నకిలీ సర్టిఫికెట్ తెచ్చుకొని గత వైఎస్ఆర్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ జరిపి పెన్షన్‌ను తీసివేయాలని



ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ఎంపిడిఒను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో దొంగ పెన్షన్లు తీసుకొనేవారు చాలామంది ఉన్నారని పూర్తి స్థాయిలో విచారణ చేస్తే ఇటువంటి దొంగ పెన్షన్ తీసుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : బుజబుజ నెల్లూరులోని శేషు స్కూల్లో పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. విశిష్ట అతిథులుగా 5వ టౌన్ సిఐ కిషోర్ కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ విచ్చేశారు.

ఎస్ఐ మాట్లాడుతూ బండి నడిపే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సిఐ పిల్లలతో మాట్లాడుతూ ఎటువంటి అసౌకర్యం కలిగినా పోలీసు వారికి చెప్పాలని, చిన్నతనంలోనే చదువుతోపాటు సంస్కారం అలవరచుకోవాలని చెప్పి, సమాజ నిర్మాణంలో విద్యార్థుల బాధ్యతను గుర్తు చేశారు. కరస్పాండెంట్ శేషు మాట్లాడుతూ సిఐ, ఎస్ఐలు తమ విలువైన సమయాన్ని వెచ్చించి తమ పాఠశాలకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ పోలీసులు శైలజ, పద్మప్రియ దర్శిని, దీపిక, రాజరాజేశ్వరి, శశికళ, ఉపాధ్యాయులు, చిన్నారులున్నారు.

డిప్యూటీ డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, రికార్డ్స్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డ్స్ రిజిస్టర్స్‌ను తనిఖీ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

ఎంఇఒ పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ పాఠశాల సముదాయ సమావేశాన్ని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాల సముదాయ సమావేశాలు విజ్ఞానం అనుభవాల కేంద్రాలను వివిధ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభరీతిలో బోధించడం ఎలా అనే విజ్ఞానాన్ని సమావేశంలో అందరూ ఉపాధ్యాయులతో పంచుకోవాలన్నారు. సమావేశానికి ఉదయగిరి, అప్పసముద్రం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మర్రిపాడు ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గోపాల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జ్యోతి, ధనలక్ష్మి, మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, రిసోర్స్‌పర్సన్‌లు రాజేంద్ర కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై ప్రజావేదిక

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పిడి గంగాభవాని పాల్గొని మాట్లాడుతూ మండలంలో ఎక్కువ శాతం కూలీలు ఉన్నారని, బాగా పనిచేసి ఇంకా పని కావాలని అడుగుతున్నారన్నారు. మండలంలో వంద రోజులు పని తక్కువగా ఉందని, దానిని మెరుగుపరచుకోవాలన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని అధికారులకు సూచించామన్నారు. కూలీలు తక్కువగా ఉన్నారని, పని చేస్తామంటున్నారు. కనుక ప్రతిరోజు 6వేల మంది పనిలో పాల్గొనేలా చూడాలన్నారు. 11 కోట్ల పైచిలుకు పనులు జరిగాయని, వర్షాలు వల్ల ఉన్నందు వల్ల ఎక్కువ భాగం

మాట్లాడుతున్న డ్వామా పిడి గంగాభవాని

చెక్ డ్యామ్‌లలో పూడికతీత పనులు చేశారన్నారు. అటవీ ప్రాంతంలో ఎక్కువగా వర్కులు ఉన్నందున ఫారెస్ట్ అధికారులు పనులు చేయనీయడం లేదని ఈ ఏడాది అడవులలో ఎక్కువగా వర్కులు చేసేందుకు అనుమతులు తీసుకున్నామని పనులు గుర్తించాలని అధికారులు సూచించారు. 11 కోట్ల పనులలో రూ.86 వేలను పలువురు నుండి రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో డివిఒ విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ డి.వెంకట్ రెడ్డి, ఎస్‌ఆర్‌పి నీలకంఠం, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి, ఎపిడి శంకర్ నారాయణ, ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, ఎపిఒ వెంకట్ నారాయణ, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన భవన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సూర్య తేజ హెచ్చరించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 7వ డివిజన్ లక్ష్మీపురం పరిసర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఇ. రామ్మోహన్ రావు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని సచివాలయం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని అంకభూపాలపురం, అయ్యవారిపల్లె గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన గ్రామ సచివాలయాలు నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. ఆ గ్రామాల్లో ఒక్కో గ్రామ సచివాలయం రూ.45 లక్షలతో నిర్మించి వదిలేశారు. పనులు పూర్తయి ఏడాది దాటినా ఇంకా ప్రారంభించకుండా అధికారులు ఆలసత్యం ప్రదర్శిస్తున్నారు. భవనాలు నిర్మించి ప్రారంభించక పోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతులు నడుమ కార్యకలాపాల నిర్వహణకు సచివాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలకు గత ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆ గ్రామాల్లో నూతన భవనాలు ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత ఆధికారులు స్పందించి.. గుత్తేదారులకు బిల్లులు చెల్లించి పూర్తయిన సచివాలయ భవనాలను ప్రాంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.కె.మష్కుర్ అహమ్మద్ సూచనల మేరకు ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.కె.జావిద్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామ ఎస్‌సి కాలనీలో 2వ రోజు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి జ్వర పీడుతుకకు రక్తపరీక్షలు, మందులు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి ఫీవర్ లార్వా సర్వే నిర్వహించారు. అపరిశుభ్రతా ప్రదేశాలలో దోమల మందు పిచికారీ చేసి డ్రైడే ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. తదుపరి వెంకటాపురం ఎంపిపి స్కూల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థిని అడిగి తెలుసుకుని వారికి చేతులు శుభ్రం చేసుకొను విధానం గూర్చి వివరించి వారి ఆరోగ్య పరిస్థితిని ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో వారికి కేటాయించిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి భూలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ రమణయ్య, రమణ య్య, ఎఎన్ఎం రసూల్‌బీ, ఆశాలున్నారు.

'గండికోట'కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పిల్లలలో "చేతుల పరిశుభ్రత, మరుగుదొడ్డి వినియోగం" పై ప్రాజెక్టు నిర్వహించడమే కాకుండా, పిల్లల ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చి వ్యాధుల నుండి విముక్తి చేసినందుకు బుచ్చిరెడ్డిపాలెం రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎం.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలయ వ్యవస్థాపకులు ఎస్.దామోదరన్, దక్షిణాసియా ఎక్స్‌టర్నల్ అఫైర్స్, పార్ట్‌నర్ షిప్స్ సంచాలకులు రవి భట్నాగర్ సంయుక్తంగా అందజేసిన ప్రశంసాపత్రాన్ని గండికోటకు అందజేసి అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బెజవాడ బుజ్జమ్మ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత, సిఆర్‌ఎంటిలు ఎస్.మల్లేశ్వర్ రెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎఒ తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలంలోని కృష్ణంపల్లి, శకునాలపల్లి రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల శాఖ శైలజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరిలో నీటి యాజమాన్యం కలుపు యాజమాన్యం ఎరువుల యాజమాన్యం, తెగుళ్ళ యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచన, సలహాల మేరకు రైతులు పాటించి అధిక దిగుబడి రాబట్టాలని ఆమె కోరారు. అనంతరం పొలం పిలుస్తుంది అనే కార్యక్రమంలో ఎఒ ఆంజనేయనాయక్ రైతులకు అవగాహన కల్పించి వరి పొలాలను సందర్శించారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల పడమటి కంభంపాడు గ్రామ రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సోమశిల రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బత్తల నరేష్, కత్తి అనిల్, చాట్ల పెంచలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో 'మెన్స్ డే'

ప్రజాశక్తి బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అంతర్జా తీయ పురుషుల దినోత్సవం ఘనంగా నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జవహర్ భారతి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అన్నివిభాగాల అధిపతులు అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ సాయిప్రసాద్ తమ సిబ్బందితో దాడి నిర్వహించే మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను నెల్లూరు పాలెం వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇసుక రీచ్ నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తెచ్చి ఓ ప్రాంతంలో నిల్వ చేసి అక్కడ నుండి లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని తెలుసుకుని వీటిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా సిఐ పోలీస్ సిబ్బందిని అభినందించారు.

హౌసింగ్ పీడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు గ్రామానికి సంబంధించిన గాంధీ గిరిజన కాలనీ లేఅవుట్‌లో హౌసింగ్ పీడీ వేణుగోపాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. లేఅవుట్‌లో వివిధ దశలో ఉన్న గృహాలు పరిశీలించారు. రూఫ్ స్లాబ్‌లో ఉన్న గృహాలను డిసెంబర్ ఆఖరికి పూర్తి చేయాలని, మిగిలిన ఇల్లు మార్చి 25నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను పిడి ఆదేశించారు. ఆయనవెంట హౌసింగ్ ఎఇ మాధవరావు, వర్క్ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

పలుచోట్ల ఇందిరాగాంధీకి నివాళులు

ప్రజాశక్తి-నెల్లూరు

భారతరత్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి కోవూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఏటూరు శ్రీనివాసుల రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి పిలుపు మేరకు ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తలారి బాల సుధాకర్, మీడియా ఇన్‌ఛార్జ్ అడ్వొకేట్ కే.సంజయ్ కుమార్, షేక్ అల్లావుద్దీన్ హుస్సేన్ బాషా, హుస్సేన్ బాషా రూరల్ మల్లికార్జున రెడ్డి, మల్లి కిషోర్ రెడ్డి, సీతా సుబ్బారావు, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇందిరా గాంధీ 107వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొదలకూరు కళ్యాణ్ నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎల్.సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ బిసిసెల్ అధ్యక్షులు కమలాపురి శ్రీనివాస్ గౌడ్, కావలి పట్టణ అధ్యక్షులు పఠాన్ ఖాదర్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కావలి రూరల్ అధ్యక్షులు తలకొండపాటి గురవయ్య, బోగోలు మండల అధ్యక్షులు కంచి వెంకటేశ్వర్లు, దగదర్తి మండల అధ్యక్షులు పైడి రవీంద్ర బాబు, జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు తాటిపర్తి బాలు, కావలి పట్టణ ఉపాధ్యక్షులు కుమ్మరిగుంట కిషోర్, కావలి పట్టణ ఎస్‌టిసెల్ అధ్యక్షులు పీరిగ శ్రీకాంత్, కావలి పట్టణ బిసిసెల్ ఉపాధ్యక్షులు కమలాపురి రాముగౌడ్, ఎస్‌సిసెల్ అధ్యక్షులు కుందుర్తి దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని బంగారుషాపుల దగ్గరలో ఉన్న పూలబజార్ సెంటర్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని భారత్ జూడో సైకిల్ యాత్ర దిగ్విజయంగా చేసిన కుంతూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో దివంగత భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ అభిమానుల మధ్య భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలను తన కారుపై కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి, శుభాకాంక్షలు చెప్పుకుంటూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.కె.గౌస్ బాషా, ఎస్‌కె బాదుల్లా, షేక్.షన్ను, ఎస్‌కె మస్తాన్, ఎస్‌కె చాన్‌బాషా, మరి కొంత మంది అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : త్యాగశీలి పేదల పెన్నిధి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 105వ జయంతి అని వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య తెలిపారు. పట్టణంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగాఆ ఆరోరోజు మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి లోక్ అదాలత్ సభ్యులు మాలకొండా రెడ్డి మాట్లాడారు. కార్యక్రమానికి గ్రంథాలయ శాఖ అధికారి సునీత ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, విద్యార్థులు, చదువరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలం కేంద్రంలో ఇందిరా గాంధీ 110వ జయంతి ఉత్సవాలు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ మాజీ పిసిసి మెంబర్ వేము హరిబాబు నేతృత్వంలో ఘనంగా చేశారు. ఈ వేడుకల్లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో నేడు బ్లాస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ దేశానికి ఆమె చేసిన సేవలను ప్రజలకు గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రామిరెడ్డి, మైనారిటీ కరిముల్లా, రాపూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి వార్డు మెంబర్ చేరిక

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీ లో యువ నేత వెంకటచౌదరి ఆధ్వర్యం లో

వైసిపి 8వ వార్డు మెంబర్ మంచాల నరసమ్మ టిడిపిలో చేరారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర దేవాదాయ దర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టిడిపి సభ్యత్వం తీసుకున్నారు.అ లాగే వారి సోదరుడు గాంధీ సభ్యత్వం తీసుకున్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వరి సాగులో మోతాదుకు మించి ఎరువులు క్రిమి సంహారక మందులు వాడడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు సాగు ఖర్చులు పెరుగుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సురేంద్ర పేర్కొన్నారు. మండలంలోని దామరమడుగు, నాగాయగుంట గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విఎఎ డి.కీర్తన, బి.పవన్ కుమార్, విహెచ్ఎ ప్రభ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : మండలం పరిధిలోని ఉలవపాళ్ళ గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి రహీం ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు వరి నారుమడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు, ఎఇఒ చరణ్, విఎఎ సూర్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని రామన్నపాలెం ఆలూరుపాడు పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ ఎస్ లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.వెంకట్రావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ షేక్ బాషా, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కెవి.పృథ్వీ, ఆర్.నిహారిక, విలేజి వెటర్నరీ అసిస్టెంట్ సుప్రియ, హరినాథ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని జి.కొండారెడ్డిపల్లి యర్రంరెడ్డిపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటలను ఆశించు చీడపీడల నిర్ధారణ కోసం ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయక సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీ మాధవి, శైలజ కుమారి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేఖ దేవి, వ్యవసాయ అధికారి రవికుమార్ కలిసి వరి, మినుము, మిరప పంటలలో క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జి కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు హరినాథ్, పవన్ కుమార్, ఆదిత్య, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని ముదివర్తి గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారి పి.వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల పడమటి కంభంపాడు గ్రామ రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సోమశిల రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బత్తల నరేష్, కత్తి అనిల్, చాట్ల పెంచలయ్య, రైతులు పాల్గొన్నారు.

పజాశక్తి-తోటపల్లిగూడూరు : వరి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించే ఉద్దేశంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి వివి శిరీష రాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాచర్లవారి పాలెం, వరకవి పూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, విఏఎలు విద్యాసాగర్, వైష్ణవి పాల్గొన్నారు.

కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ.నెం.300/24
ఏ.ఎస్.నెం 63/2018
ఏదిరీలు :
కొమ్మి కొండపనాయుడు - పిటిషనర్/అప్పిలెంట్
వర్సెస్
బొట్ట వెంకట రమణమ్మ,
మరియు ఇతరులు - రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు

To,
R4) **అత్తుపోలు లలిత కుమారి,** W/o **ఆనంద్,**
గద్దలగుంట దగ్గర, వాటర్ ట్యాంక్ ప్రక్కన,
కాంగ్రెస్ ఆఫీస్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
R5) **ఇనకొల్లువెంకటసురేష్,** S/o లేట్ **వెంకట కృష్ణయ్య,** D.No.8-31-1,4 వ లైను,
శాలివాహన స్కూలు దగ్గర, వైకుంఠపురం,
కావలి, SPSR నెల్లూరు జిల్లా. అనువారికి,

ఈ నెంబరున, పిటిషనరు / అప్పిలెంట్ తరుపున వారసులను చేర్పించుట కొరకు CPC Sec 151 అండ్ U/Order 22, Rule 4 ప్రకారం పిటిషన్ దాఖలు చేసుకొన్నందున మీకు నోటీసు నిమిత్తం **తే26-11-2024దికి** వాయిదా వేయబడియున్నది. కనుక ఇందు విషయమై మీకు గల ఆక్షేపణలు ఆ రోజు **పగలు 10.30 గంటలకు** పై కోర్టులో హాజరై, తెలుపుకొనవలసిందిగా కోరడమైనది. మీరు రాని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
శ్రీదేవరపల్లి వేణు గోపాల్ రెడ్డి,
శ్రీమతి బండారు శీనమ్మ,
అడ్వకేట్స్
కావలి. SPSR నెల్లూరు జిల్లా.

పాస్ పోర్ట్ పోయినది

పేట భార్గవ్, తండ్రి పేట రవి, లేగుంటపాడు, జంగం వీధి నుండి కోవూరు బజాజ్ సెంటర్‌కు జెరాక్స్ కోసం తీసుకొని వస్తుండగా తే16-11-2024ది న మార్గమధ్యంలో పోయినది. ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ : W5815450 ఎవరికైనా దొరికిన యెడల ఇవ్వవలసిందిగా మనవి.

పేట భార్గవ్, తండ్రి పేట రవి,
లేగుంటపాడు, సెల్: 7680069158

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బోగోలు మండలం, మంగమూరు గ్రామపంచాయతీ, పరిదిలోని చెరువులో గల నల్లతుమ్మ చెట్లు కొట్టుకొని అమ్ము కొనుటకు **తేదీ: 23-11-2024న ఉదయం 11-00 గంటలకు** మంగమూరు గ్రామపంచాయతీ కార్యాలయం నందు వేలం పాట నిర్వహించబడును. ఆసక్తిగలవారు **రూ.50,000/-** డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చును. షరతులకు లోబడి వేలంపాట నిర్వహించబడును. ఇతర వివరములకు కార్యాలయం పని దినములలో గ్రామపంచాయతీ వారిని సంప్రదించగలరు.

ఇట్లు
పంచాయతీ కార్యదర్శి,
ముంగమూరు గ్రామపంచాయతీ,
బోగోలు (మం) ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా,
సెల్ నెంబర్: **95020 51236**